బ్రాండెడ్ కంపెనీలకే బురిడీ..!

◆ గతంలో పురుగుల మందులు

◆ ఇప్పుడు సిమెంటు కూడా నకిలీదే

◆ తనిఖీల్లో పట్టుకున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ శాఖ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రముఖ బ్రాండెడ్ కార్పొరేట్ కంపెనీలకే బురిడి కొట్టించేస్తున్నారు. అదే బ్రాండ్‌ల పేరుతో అదే రకమైన లేబుళ్లతో నకిలీలు మార్కెట్‌లోకి వచ్చేస్తున్నాయి. వీటిని కంపెనీవని కొనుగోలు చేసి వినియోగదారులు నష్టపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. గతంలో అనంతపురం నగరంలో బయర్ కంపెనీకి చెందిన పురుగుల మందులు నకిలీవి వచ్చాయి. వీటిని కంపెనీ వారే తమవి కాదని తేల్చి చెప్పారు. ఫోరోనిక్స్ ల్యాబ్‌లోనూ ఇవి లోటుపాట్లు గుర్తించారు. ప్రముఖ కార్పొరేట్ కంపెనీలు కూడా నకిలీలు మార్కెట్‌లోకి తీసుకొస్తున్న వారిపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడే పరిస్థితులున్నాయి. మహారాష్ట్రకు చెందిన కొంత మంది నకిలీలను తయారు చేసి మార్కెట్‌లోకి తీసుకురావడమే కాకుండా చర్యల్లేకుండా రాజకీయపరమైన ఒత్తిళ్లు తీసుకొస్తుండటంతో ఏమీ చేయలేని పరిస్థితులు అధికారుల్లో నెలకొంది. తాజాగా ఇప్పుడు సిమెంట్ విషయంలోనూ ఇదే రకమైన మోసం జరిగింది. విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఈ విషయం తేలింది. దీనిపై చర్యలు తీసుకుంటున్నట్టు ఆ శాఖ అధికారులు ఇప్పటికే ప్రకటించారు.

అల్ట్రాటెక్ పేరుతో నకిలీ సిమెంట్

సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం బూదిలి గ్రామం పరిధిలో కస్తూరి సిమెంట్స్ యూనిట్స్ పేరుతో సిమెంట్ విక్రయాలు జరుగుతున్నాయి. సదరు యూనిట్‌లో విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు మంగళవారం నాడు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పోర్టుల్యాండ్ పొజొలాన సిమెంట్ పేరుతో జీఎస్టీ రిజిస్ట్రేషన్ ఉంది. ఇక్కడ ఫ్లైయాస్, పిపిసిలు నిర్ణీత మోతాదు కంటే ఎక్కువ కలిపి అల్ట్రాటెక్ సిమెంట్ బ్రాండ్ మీద కర్నాటకలో విక్రయాలు చేస్తున్నట్టుగా విజిలెన్స్‌ఎన్‌పోర్సుమెంట్ అధికారులు గుర్తించారు. ఇక్కడి నుంచి కర్నాటకకు బయలుదేరుతున్న కెఎ 53బి 3976 లారీలో 340 బస్తాల సిమెంట్, 88 ఖాళీ సంచలు పట్టుకున్నారు. ఈ సరుకు అల్ట్రాటెక్‌కు సంబంధించినది కాదని, నకిలీదని అల్ట్రాటెక్ సిమెంటు సిబ్బంది గుర్తించారు. దీంతో విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు పరిశ్రమ నిర్వాహకులపై బిఎన్ఎస్ యాక్టు 2023, ట్రేడ్ మార్కు యాక్టు 1999 మేరకు క్రిమినల్ కేసులతోపాటు తూనికల కొలతల శాఖ నుంచి ఏడు కేసులు నమోదు చేశారు. ఈ రకంగా నకిలీ సిమెంటు తయారు చేసి కోట్లాది రూపాయల లావాదేవీలు చేసినట్టు వాణిజ్యపన్నుల శాఖ అధికారులు ఈ తనిఖల్లో గుర్తించారు. పూర్తి స్థాయి విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి వైబిపిటిఎ ప్రసాద్, డీఎస్పీ యం.నాగభూషణం, సిఐ కె.శ్రీనివాసులు, ఎస్ఐ గోపాలుడు, ఎసిటిఒ రమేష్‌రెడ్డి, తూనికలు కొలతల శాఖ అధికారి శివశంకర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎఇఇ కృష్ణారెడ్డి, తదితరు పాల్గొన్నారు.

టిడిపిదేనా చైర్మన్ పీఠం..!

◆ 'దుర్గం'లో తారుమారైన వైసీపీ అంచనాలు

◆ టిడిపిలోకి వైస్‌చైర్మన్ జయంఫణి

◆ 11న ఎన్నిక



కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక దగ్గరపడేకొద్ది పట్టణంలో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలు చైర్మన్ పీఠం కోసం గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నిక దగ్గరపడుతున్న సమయంలో వైసీపీ మున్సిపల్ వైస్ చైర్మన్ జయంఫణి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సమక్షంలో మంగళవారం నాడు టిడిపిలో చేరారు. ఈయన చేరికతో వైసీపీ అంచనాలు ఒక్కసారిగా తలకిందులయ్యాయి. వైస్ చైర్మన్ వైసిపికి షాక్ ఇవ్వడంతో కళ్యాణదుర్గం చైర్మన్ పీఠాన్ని టిడిపి కైవసం చేసుకోవడం లాంఛనంగానే కన్పిస్తోంది.

కళ్యాణదుర్గం మున్సిపల్ కార్యాలయం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కళ్యాణదుర్గం చైర్మన్ ఎన్నికను ఈ నెల 11వ తేదీన నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నిక నేపథ్యంలో ఇప్పటికే వైసీపీ వారి కౌన్సిల్ సభ్యులను క్యాంపునకు తరలిచింది. టీడీపీ సైతం వారి కౌన్సిలర్లను క్యాంపునకు తరలించారు. రెండు పార్టీలు క్యాంపు రాజకీయాలు చేస్తున్నా కొందరు కౌన్సిలర్లు వెళ్లలేదు. ఇదిలా ఉండగా వైసీపీ క్యాంపు శిబిరంలో ఉన్న వారిలో ఎందరు ఆ పార్టీకి మద్దతుగా ఓటేస్తారన్న దానిపై ఆ పార్టీలోనే సందేహాలు నెలకొన్నాయి. వైస్ చైర్మన్ జయంఫణి టీడీపీలో చేరడంతో మిగిలిన వైసీపీ సభ్యులు మరికొందరు సైతం ఆ పార్టీకి హ్యాండ్ ఇస్తారనే ప్రచారం నడుస్తోంది. ఛైర్మన్ పీఠంపై మంగళవారం సాయంత్రం వరకు ధీమాగా ఉన్న వైసీపీ శిబిరంలో వైస్ ఛైర్మన్ పార్టీ మార్పుతో కలవరం మొదలైంది.

2021లో జరిగిన కళ్యాణదుర్గం మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ తరపున నలుగురు, స్వతంత్ర అభ్యర్థిగా ఒకరు, 19 మంది వైసీపీ తరపున కౌన్సిలర్లుగా గెలుపొందారు. దీంతో అప్పట్లో ఛైర్మన్ పీఠాన్ని వైసిపి కైవసం చేసుకుంది. నాటకీయక పరిణామల మధ్య వైసీపీ అధిష్టానం ఛైర్మన్‌ను పదవి నుంచి తప్పించింది. అప్పటి నుంచి ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా తిమ్మప్ప కొనసాగుతున్నారు. ఎన్నికల సంఘం ఛైర్మన్ ఎన్నిక నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడంతో వైసిపి, టిడిపిలు దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. తమ సీటును కాపాడుకోవాలని వైసిపి, అధికార పార్టీ కావడంతో ఛైర్మన్ గిరిని సొంతం చేసుకోవాలని టిడిపి ప్రయత్నాలు చేస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నిక ముందు, కూటమి అధికారంలోకి వచ్చాక ఆరుగురు కౌన్సిలర్లు టిడిపిలో చేరారు. ఇక స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన గౌతమి బీజేపీలో చేరారు. ప్రస్తుతం కౌన్సిల్‌లో కూటమి బలం 11కు చేరుకుంది. ఎంపి, ఎమ్మెల్యేలు ఓటుతో కలుపుకుంటే కూటమి బలం 13కు చేరుతుంది. ఇదే సమయంలో వైసీపీకి 13 మంది సభ్యుల బలం ఉంది. ఎన్నికల అనంతరం టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్ గంగమ్మ మళ్లీ రంగయ్య వద్దకు చేరుకోవడంతో ఆ పార్టీ బలం మరింత పెరిగింది. ఇదే సమయంలో సస్పెన్షన్‌లో ఉన్న వైసీపీ వైస్ ఛైర్మన్ జయంఫణి టిడిపిలోకి వెళ్లడంతో వైసిపికి కొత్తచిక్కులు వచ్చాయి. పార్టీ ఫిరాయింపుల వ్యవహారం జయంఫణితోనే ఆగిపోతుందా... క్యాంపులో ఉన్న మరికొందరు కౌన్సిలర్లు టిడిపిలోకి వెళ్తారా అన్న సందేహాలు వైసిపి నాయకులను వెంటాడు తున్నాయి. ఏదిఏమైనా ఛైర్మన్ పదవిని కూటమి దక్కించు కోవడానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్ని అవకాశాలనూ వాడుకుంటున్నట్లు స్పష్టమవుతుంది.

చెన్నేకొత్తపల్లిలో బియ్యాన్ని పరిశీలిస్తున్న అంజనాదేవి

ఫుడ్ కమిషన్ సభ్యురాలి తనిఖీలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

సత్యసాయి జిల్లా ఫుడ్ కమిషనర్ సభ్యురాలు గంజిమాల దేవి మంగళవారం నాడు పట్టణంలో తనిఖీలు చేశారు. అంగన్వాడీ సెంటర్స్, చౌకధాన్యపు దుకాణాలు, పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ బి.గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. మండలం, పట్టణంలోని అన్ని చౌక ధాన్యపు డిపోల్లో ప్రజలకు నాణ్యమైన సరుకులు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా పలువురు డీలర్లు ఆమెను కలిసి సమస్యలను తెలియజేశారు.

చెన్నేకొత్తపల్లి : రాష్ట్ర ఆహార సంఘ సభ్యులు గంజిమాల దేవి శనివారం మండలంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. చెన్నేకొత్తపల్లి సామాజిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లో చౌక దుకాణాలకు పంపిణీ అయ్యే బియ్యం, చక్కెర తదితర సరుకుల నిల్వ, పంపిణీ రికార్డులను తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు పంపిణీ అయ్యే కందిపప్పు, ఆయిల్, ఇతర పోషకాహార పదార్థాల స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి, గర్భిణీ స్త్రీలకు అందించే వస్తువులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ముదిగుబ్బ : హాస్టల్ విద్యార్థులకు మెనూ విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి హెచ్చరించారు. ఈ మేరకు ఆమె మంగళవారం మండల కేంద్రంలోని కేజీబీవీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. వంటగది మరియు స్టాక్ పాయింట్ ని తనిఖీ చేసి పలు లోపాలను గుర్తించారు. ముఖ్యంగా పాడైపోయిన కూరగాయలు వాడుతుండడం అలాగే బియ్యంలో పురుగులు కనిపించడంతో వంట చేసే సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ వార్డెన్ ఫక్రుబి మెనూ, స్టాక్ విషయంలో తడబడటం చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాక్ రికార్డులు, మెనూ విషయంలో ఎలాంటి రాజీ వ్యవహారాలు కుదరవని హెచ్చరించారు. అనంతరం ఐసిడిఎస్ అంగన్వాడి టీచర్లు ఏర్పాటు చేసిన సామూహిక సీమంతం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కారక్యక్రమంలో ఎంపీడీవో శకుంతల, ఎంఈవోలు రమణప్ప, వెంకట చలపతి, ఐసిడిఎస్ అధి కారిణి చంద్రకళ, మధ్యాహ్న భోజన పథకం అధికారులు తదితరులు పాల్గొన్నారు

ముదిగుబ్బ కేజీబీవీ హాస్టల్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కమిషన్ సభ్యురాలు

మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా

రహదారి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణం ఆరవ వార్డు శ్రీనివాస నగర్ లో మాస్టర్ ప్లాన్ కు అనుగుణంగా రహదారి సౌకర్యం కల్పించాలని స్థానికులు మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, కమిషనర్ మల్లికార్జునను కోరారు. ఈ మేరకు మంగళవారం చైర్మన్, మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస్ నగర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రహమత్ పుర సర్కిల్ నుండి సాయి శ్రీనివాస్ నగర్ కు వెళ్లే రహదారి అధ్వానంగా మారిందని, పాంచజన్య పాఠశాల, అపార్టుమెంట్లు ఉండటం వల్ల ప్రమాదాల జరుగుతున్నాయన్నారు. గృహాలు పెరిగాయని అందుకు అనుగుణంగా రహదారులు లేవని అన్నారు. ఎంజీఎం హైస్కూల్ ప్రహరీ ఆనుకొని మాస్టర్ ప్లాన్ లో ఉన్న 40 అడుగుల రహదారిని పునరుద్ధరించాలని స్థానికులు కోరారు. అదే విధంగా కాలనీలో కాలువలను ఏర్పాటు చేసి రహదారి సౌకర్యంతో పాటు విద్యుత్ సదుపాయం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బందితోపాటు కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తపాలా కార్యాలయంలో అవగాహన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రధాన తపాలా కార్యాలయంలో మంగళవారం 'నివేశక్ దిది'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐపిపిబి మేనేజర్ మురళి, హెడ్ పోస్ట్ మాస్టర్ మార్కండేయ ఆధ్వర్యంలో వినియోగదారులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పెట్టుబడిదారుల విద్యా, ఆర్థిక అంశంపై అవగాహన కల్పించారు. పెట్టుబడుల భద్రత, ఆర్థిక జాగృతి, మోసపూరిత పథకాలపై జాగ్రత్తలు, డిజిటల్ లావాదేవీల ప్రాముఖ్యత వంటి అంశాలను వివరించారు. 'నివేశక్ దిది' ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెట్టుబడి జ్ఞానాన్ని విస్తరించడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తపాలా ఉద్యోగి దివ్యభారతి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - అమడగూరు

మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి ఓబులు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం జరుగుతున్న ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమ విశేషాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు సమతుల ఆహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించు కోవాలన్నారు. లేబోరేటరీ లో రికార్థుల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి గిరిధర్ రెడ్డి, సహాయ మలేరియా అధికారి లక్ష్మి నాయక్, కదిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి దేవలా నాయక్, సూపర్ వైజర్ శశిధర్, సి. హెచ్.ఓ ఫక్రుద్దీన్, సూపర్ వైజర్ నాగమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ గాయత్రి, కార్తీక్ రెడ్డి, హెల్త్‌అసిస్టెంట్లు చాంద్ అనిల్ బాబు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-హిందూపురం

అయిదేళ్ల చిన్నారులందరికి పోలియో చుక్కలు అందించడ అందరి బాధ్యతని, పోలియో రహిత భారత్ రూపకల్పనకు కృషిచేద్దామని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సురేష్ బాబు తెలిపారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని పోలియో సూపర్ వైజర్లకు ప్రభుత్వాసుపత్రిలో సమీక్షా సమావేశం నిర్వహించారు. నూరు శాతం చిన్నారులకు పోలియో చుక్కలు అందించాలని పేర్కొన్నారు. ఈ నెల 21 తేదీ నుండి 23 తేదీ వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో తొలి రోజు బూత్ నిర్వహణ, ఆ తర్వాత రెండురోజులు గృహ సందర్శనల ద్వారా నిర్వహించాలని తెలిపారు. అలాగే ట్రాన్సిట్ ప్రాంతాలు, కొత్తగా వెలసిన ప్రాంతాల్లో పోలియో చుక్కలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో సిహెచ్ఒ వన్నప్ప, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా కదిరి అభివృద్ధి

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి నియోజకవర్గాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వెల్లడించారు. మంగళవారం నాడు కదిరి మున్సిపల్ కార్యాలయంలో ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం సుందరీకరణ, భృగతీర్థం (కోనేరు) సుందరీకరణ పనులపై పుర ప్రముఖులు, పెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అభివృద్ధిపై ప్రజల అభిప్రాయాలను తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రసాదం పథకం కింద ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం సుందరీకరణ, భగతీర్థం (కోనేరు) సుందరీకరణ పనులు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయ ఈవో దొంగతనం వ్యవహారంపై ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. పవిత్రమైన ఎర్రదొడ్డి గంగమ్మ పుణ్యక్షేత్రంలో విధులు నిర్వహిస్తున్న ఈవో దొంగతనానికి పాల్పడడం విచారకరం అన్నారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. కాగా ఈవోపై వస్తున్న విమర్శల నేపథ్యంలో సెప్టెంబర్ 29వ తేదీనే తాము ఆయనపై చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ అధికారులకు లేఖ రాశామన్నారు. ఎర్రదొడ్డి ఆలయానికి సంబంధించిన వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామన్నారు. అన్నదానానికి భక్తుడు లక్ష రూపాయలు విరాళం ఇస్తే ఆ సొమ్మును వైసీపీ నేత కాజేసారని తెలిపారు. దీనిపైనా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. ఆలయ పవిత్రతకు భంగం కలిగించేందుకు ప్రయత్నించిన ఏ ఒక్కరినీ వదలబోమన్నారు.

'కదిరి గొడ్డలి' జగన్‌ను వెంటాడుతుంది

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని కదిరి గొడ్డలి వెంటాడుతుందని ఎమ్మెల్యే కందికుంట తెలియజేశారు. తనపై విమర్శలు చేసే స్థాయి వైసిపి నేతలకు లేదన్నారు. జగన్, వైసిపి నాయకలకు కదిరి గొడ్డలంటనే ఉలికిపాటుకు గురవుతారన్నారు. త్వరలో వారందరూ కదిరి చూసి భయపడే పరిస్థితికి వస్తారన్నారు.

రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలి: ఎమ్మెల్యే

రైతులకు చియా సీడ్ అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి టౌన్

రైతన్నలు సమష్టిగా ముందుకెళ్లి స్వయం సాధికారత ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించాలని కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. అతియ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకున్నాయని అందుకు రైతుల కోసం అతియా ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ కార్యకలాపాలు సాగించడం హర్షణీయమని అన్నారు. గతంలో ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటిపోయి 600 అడుగులు బోర్లు వేస్తే నీళ్లు పడని పరిస్థితి ఉండేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు చూపుతో తీసుకున్న నిర్ణయాలతో ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగాయని అన్నారు. రైతన్నలు తాము పండించిన పంటలను దళారులకు విక్రయించి నష్టాల ఊబిలోకి వెళ్లకుండా సంఘటితంగా ఏర్పడి తమ ఉత్పత్తులను ఇతర ప్రాంతాల్లో ఇతర దేశాలలో వారే స్వయంగా విక్రయించేలాగా సంఘటితంగా ఏర్పడాలని సూచించారు. రైతు సంఘాల ద్వారా బలోపేతమై స్వయం సాధికారికత సాధించాలన్నారు. నాబార్డ్ ద్వారా రైతులకు రుణాలు మంజూరు చేస్తారని తెలిపారు. ప్రధానంగా వ్యవసాయం లో ఎప్పుడు పండించే పంటలు కాకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలన్నారు. అతియా ఫార్మర్స్ కంపెనీ ద్వారా రైతులకు సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయాంత్రీకరణ పనిముట్లు పంపిణీ చేస్తున్నారని ఎఫ్ పి ఓ సంఘాల ఏర్పడేందుకు ముందుకు రావాలని తెలిపారు. అంతకుముందు అతియా కంపెనీ ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు. చిన్నారులు రైతన్నల ఆవేదనను పాట రూపంలో చేసిన నాట్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది, ఈ సందర్భంగా కలెక్టర్ శ్యాంప్రసాద్ అతియా సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, ఆర్డీవో వీవిఎస్ శర్మ, ఏడీఏ సమానుల్లా, ఎంపీడీవో పోలప్ప, తహశీల్దార్ మురళీకృష్ణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ అనసూయ చౌదరి, కంపెనీ సిఇఒ వెంకటేష్, సిసిఒ బాలకృష్ణ రెడ్డి, శకుంతల, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక రాజ్యాన్ని స్థాపించడమే సిఐటియు లక్ష్యం

సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ

హిందూపురంలో పోస్టర్లు అతికిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - బుక్కపట్నం

కార్మిక రాజ్యాన్ని స్థాపించి కార్మికులకు అండగా నిలబడడమే సిఐటియు లక్ష్మని సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిఐటియు 18వమహాసభ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడమే సిఐటియు ఆశయమని అన్నారు. ఆ ఆశయ సాధన ద్వారానే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. గత 11 సంవత్సరాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా ప్రజా వ్యతిరేక పాలన చేస్తున్నాయని విమర్శించారు. కార్మికుల హక్కుల కోసం విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు జరిగే సిఐటియు మహాసభలలో కార్మికులు కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కార్యదర్శి బ్యాల అంజి సిఐటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : ఈనెల 31వ తేదీ నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్, సిఐటియు మండల కన్వీనర్ అంకె ముత్యాలప్ప కోరారు. ఈ సందర్భంగా మంగళవారం కొత్త చెరువులోని దుకాణాలలో విరాళాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో నాగభూషణ్, కురువ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : విశాఖపట్నంలో నిర్వహించే సిఐటియు మహాసభలను విజయవంతం చేయాలని సిపిఎం నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం మండలకేంద్రంలో మాస్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిఐటియు మండల కార్యదర్శి బాబ్జాన్, గౌరవాధ్యక్షులు బండల వెంకటేశ్ఖు కో కన్వీనర్ టైలర్ ముస్తఫా, పకీరప్ప, రిక్షా ముస్తఫా, చాంద్ బాషా, పంచాయతీ కార్మికులు, ఏపీ ట్రాలీ యూనియన్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : విశాఖపట్నంలో ఈ నెల 31వ తేదీ నుండి 2026 జనవరి 4వ వరకు జరిగే అఖిలభారత సిఐటియు 18వ మహాసభల జయప్రదంలో భాగంగా నాయకులు హిందూపురం పట్టణ, పరిసర ప్రాంతాల్లో విస్తత ప్రచారం నిర్వహిస్తున్నారు. పట్టణంలో విస్తతంగా ప్రచారం చేస్తూ అంబేద్కర్ సర్కిల్, చిన్న మార్కెట్, సివిల్ సప్లై గోదాము, వ్యవసాయ మార్కెట్ యార్డ్, ఎల్ఐసి, విద్యుత్, మున్సిపల్ కార్యాలయాలతో పాటు అన్ని బ్యాంకులు, ఆటో స్టాండ్‌ల వద్ద గోడపత్రికలను అతికించి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి విఆర్ రాము, కార్మికులు కిరణ్, కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

'పది'మోడల్ పేపర్లు పంపిణీ

పది మోడల్‌పేపర్లతో విద్యార్థులు, తదితరులు

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని నారనాగేపల్లి, తురకలాపట్నం ప్రభుత్వం హైస్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన పదోతరగతి మోడల్ పేపర్లను పంపిణీ చేశారు. నారా నాగేపల్లి ఉన్నత పాఠశాలలో యూ టీ ఎఫ్ జిల్లా నాయకులు జి.సి.నరేష్ కుమార్ సమక్షంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు జి.రమేష్ సౌజన్యంతో 10 వ తరగతి చదువుతున్న 28 మంది విద్యార్థులకు మోడల్‌పేపర్లను ఉచితంగా పంపిణీ చేశారు. తురకలాపట్నం ఉన్నత పాఠశాలలో 26 మంది విద్యార్థులకు మోడల్‌పేపర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు సాని పల్లి గంగాధర్, జి సి నరేష్, శేషాద్రి, ఆది, జినేష్ జైన్, అశోక్, నారనాగేపల్లి ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి www.prajasakti.com

వయోజన విద్యపై శిక్షణ

ప్రజాశక్తి అమడగూరు

మండల కేంద్రంలోని అమృత మండల సమైఖ్య సమావేశ భవనంలో మండల విద్యాధికారి జిలాన్ బాషా ఆధ్వర్యంలో ఉల్లాస్ అక్షర ఆంధ్ర వయోజన విద్యా వాలంటీర్లకు శిక్షణాకార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఈ ఏడాది 1907 మంది నిరక్షరాసులు గుర్తించి వీరిని డిఆర్ డిఏ , డ్వామా సహకారంతో ఫిబ్రవరి 2026వరకు తరగతులు నిర్వహించి మర్చిలో పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులను గుర్తించి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. వయోజనులకు బోధించే పద్ధతులపై వాలెంటర్లకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యా పర్యవేక్షకులు మధుసూదన్, సిడిపిఒ గాయిత్రి, గంగాదేవి, ఏపీవో మధుసూదన్ రెడ్డి, ఎపిఎం భారతి, మహిళా మండలి సభ్యురాళ్లు మునిరత్నమ్మ, వేమలమ్మ, సీసీలు, అకౌంటెడ్, యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

సంతకాల సేకరణ

ప్రజాశక్తి - మడకశిర రూరల్

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మండల పరిధిలోని వైబిహళ్లి గ్రామపంచాయతీలో మంగళవారం వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవి శఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు ఇంటింటికి వెళ్లి మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేస్తే జరిగే నష్టాన్ని వివరిస్తూ సంతకాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ ఉపాధ్యక్షులు మధు, హరే సముద్రం పంచాయతీ సర్పంచి కరియన్న, మండల కార్యదర్శి సుధాకర్, వై బి హళ్లి శంకర్ రెడ్డి, పత్తికుంట విశ్వనాథ్ గౌడ్, దొడ్డయ్య, మనోహర్ రెడ్డి, నాగేష్, శ్రీరామ్, హనుమంతు, కమల్ తదితరులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

మండలంలోని చిన్నపరెడ్డిపల్లి, గుట్టూరు గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారిణి కె సి చందన ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పంటసాగు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిన్న వెంకటరాముడు, మండల ఫైవ్ మ్యాన్ కమిటీ సభ్యులు, గుట్టూరు మాజీ సర్పంచ్ సూర్యనారాయణ, గుట్టూరు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు గోవిందు , పెనుకొండ క్లస్టర్ ఇంచార్జ్ ఆదిశేషు , వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. అశోక్‌కుమార్, రైతు సేవాకేంద్రం సిబ్బంది కృష్ణవేణి, అనిత, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

11న ఏపీ ఎన్జీవో ఎన్నికలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం తాలూకా ఏపి ఎన్‌జిఒ అసోసియేషన్ తాలూకా ఎన్నికలు 11వ తేదీ జరుగుతాయని ప్రస్తుత తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు బి.నరసింహులు, కే.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఎన్నికలు ఉదయం 10. 30 గంటల నుండి ప్రారంభమవుతాయన్నారు. హిందూపురం తాలూకా పరిధిలోని హిందూపురం మున్సిపాలిటీ, హిందూపురం రూరల్, లేపాక్షి ,చిలమత్తూరు, పరిగి, గోరంట్ల మండలాల్లోని ఉద్యోగులు హాజరై ఏపీ ఎన్‌జిఒ ఎన్నికలను విజయవంతం చేయాలని కోరారు.

కేజీబీవీ తనిఖీ

ప్రజాశక్తి - మడకశిర టౌన్

గుండుమల కేజీబీవీని అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ దేవరాజు మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే ఎమ్మెల్సీ రాజు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అదే విధంగా కలెక్టర్ శ్యాం ప్రసాద్ సోమవారం కేజీబీవీని తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ మేరకు దేవరాజు మంగళవారం తన సిబ్బందితో వెళ్లి పాఠశాలలో తనిఖీ చేసి సమస్యలను గుర్తించారు.

క్రీడా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - గోరంట్ల

కొత్తచెరువుకు చెందిన ప్రభాత్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు 15వేల రూపాయలు విలువైన క్రీడా పరికరాలను అందజేశారు. అందులో వాలీబాల్ హ్యాండ్ బాల్ నెట్ బాల్ తదితర క్రీడా పరికరాలు అందజేశారు. మంగళవారం గోరంట్ల పట్టణం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో దాతలు అందజేసిన క్రీడా సామాగ్రిని ప్రధానోపాధ్యాయులు బి. ఈశ్వర్ ప్రసాద్ అధ్యాపకులు, వ్యాయామ ఉపాధ్యాయుడు అజీమ్ భాష తో కలసి విద్యార్థులకు అందజేశారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మండలంలోని దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డాక్టర్ బి. నాగేంద్ర నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ పుష్పలత, డాక్టర్ దిలీప్ కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాంబశివమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం

ప్రజాశక్తి - అమడగూరు

మండల పరిధిలోని ఎ రెడ్డివారిపల్లిలో మంగళవారం రాష్ట్రీయ గోకుల మిషన్ లైవ్ స్టాక్ డౌలప్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో పశువుల గర్భకోశ వ్యాధుల నివారణ ఉచిత శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పశుగణాభివృద్ధి ఉపసంచాలకులు వెంకటేష్ పాడి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు కేశవయ్య, రవి నాయక్, సిబ్బంది పాడి రైతులు పాల్గొన్నారు.

దొంగనోట్ల ముఠా అరెస్టు

నకిలీ కరెన్సీ స్వాధీనం

ప్రజాశక్తి - బత్తలపల్లి

దొంగనోట్లు చెలామణి చేసే దొంగల ముఠా సభ్యులైన నలుగురిని అరెస్టు చేసినట్లు ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐఐ సోమశేఖర్, ట్రైనీ ఎస్ఐ నాగ ప్రసన్నలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దొంగలముఠా అరెస్టు వివరాలను వెల్లడించారు. కడప జిల్లా కొండాపురం మండలం తాళ్ల పొద్దుటూరు గ్రామానికి చెందిన బోడేపల్లి అంజి, అదే జిల్లా కొండాపురం మండలం దాములూరు గ్రామానికి చెందిన ఓబులేసు పరిచయస్థులు. ఈ పరిచయం వల్ల ఓయిలేసుకు నకిలీ నోట్ల వ్యవహారం గురించి అంజి చెప్పి ఏదైనా పార్టీ ఉంటే అసలైన నోట్లు రూ.1లక్షకు, నకిలీ నోట్లు రూ.3లక్షలు ఇస్తామని చెప్పాడు. అందుకు ఓబులేసు అంగీకరించి దొంగనోట్ల చెలామణికి పథకం రూపొందించారు. ఓబులేసుకు పరిచయం ఉన్న అనంతపురం జిల్లా: తాడిపత్రి మండలం బోడాయపల్లి గ్రామానికి చెందిన శిరోల్లా రాజకుళ్లాయప్పకు విషయం చెప్పి ఇతని ద్వారా కడప జిల్లా కమలాపురం మండలం లింగయ్యపల్లి గ్రామానికి చెందిన ఇల్లూరి వీరాంజనేయరెడ్డికి ఈ నకిలీ నోట్ల గురించి వివరించారు. అందుకు వీరాంజనేయరెడ్డి నకిలీ నోట్లను సులభంగా ప్రజల మధ్య గానీ, ఏటీఎంల ద్వారా గానీ మార్పిడి చేయవచ్చునని ఆలోచించాడు. దీంతో మిగతా ముగ్గురితో డీల్ కుదుర్చుకున్నాడు. అందులో భాగంగా గత నెల 18వ తేదీన అందరూ బత్తలపల్లి మండలం సంజీవపురం గ్రామ సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రంలోకి వెళ్లే ఆర్చ్ వద్ద కలిశారు. ఒక నకిలీ నోటును వీరాంజనేయరెడ్డికి చూపించగా దానిని చూసిన ఆయన ఈ నోటును ఈజీగా ప్రజల్లో మార్పిడి చేయవచ్చునని భావించాడు. అసలైన రూ 3లక్షలకు నకిలీ నోట్లు రూ 9లక్షలు ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన వాలు, మరో వ్యక్తితో డీల్ కుదుర్చుకున్నారు. వారు అనుకున్న ప్రకారం మరుసటి రోజు అంటే 19న తిరిగి కాటికోటేశ్వర క్షేత్రం ఆర్చ్ వద్ద బాలు, హరి నకిలీ నోట్లు తీసుకువచ్చి వీరాంజనేయరెడ్డి దగ్గర ఉన్న అసలైన రూ. 3లక్షలు తీసుకుని వెళ్లిపోయారు. అయితే వారు ఇచ్చిన నకిలీ నోట్లు కూడా సరైనవి కాదని వీరాంజనేయరెడ్డి గమనించి ఓబులేసు, అంజితో మాట్లాడాడు. డబ్బులు విషయమై మాట్లాడాలని చెప్తే వారు అందుకు సోమవారం బత్తలపల్లి మండలం వెంకటగారిపల్లి క్రాస్ వద్ద సమావేశం ఏర్పాటు చేసుకున్నారు.. అక్కడ వారి మధ్య డబ్బులు విషయంలో గొడవ జరుగుతుండగా సమాచారం తెలుసుకున్న బత్తలపల్లి ఎస్ఐ తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. తమ విచారణలో వారు దొంగనోట్లు చలామణి చేసే ముఠాగా గుర్తించినట్లు సిఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఇందులో మరో ఇద్దరిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో మూర్తి, సూర్యనారాయణ, హెడ్ కానిస్టేయిల్ గంగాధర్, కానిస్టేబుళ్లు అబ్బాజాన్, సుదర్శన్ నాయుడు అనిల్ కుమార్, నారాయణస్వామి హోంగార్డు రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సిఐ, తదితరులు

తీరు మారకుంటే చర్యలు

మండలమీట్‌లో సచివాలయ సిబ్బందిపై ఎంపిపి ఆగ్రహం

ప్రజాశక్తి - నల్లచెరువు

మండలంలోని ఆయా గ్రామాల సచివాలయాల సిబ్బంది పనితీరు మారకుంటే చర్యలు తప్పవని ఎంపిపి రమణారెడ్డి హెచ్చరించారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రమణారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. అధికారుల తీరుపై ఎంపిపి ఈసందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి గైర్హాజరైన ఆయా శాఖల అధికారులకు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అభిబృద్ధి ప్రణాళికల కోసం మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజరుకావటం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మండల వ్యాప్తంగా జరుగుతున్న విద్యుత్ పోల్ మార్పుల ప్రక్రియలో కాంట్రాక్టర్లు చేస్తున్న పని వల్ల పంచాయతీల్లో పైపులైన్లు ధ్వంసం అవుతున్నాయని విద్యుత్ అధికారులు స్పందించడం లేదని సర్పంచి జొన్న హర్షవర్ధన్ నాయుడు సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు ఎవరు హాజరు కాకపోవడం పట్ల ఉన్నత అధికారులకు ఎంపీపీ రమణారెడ్డి ఫోన్లో తెలపగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో గైహాజరుకు సంబంధించిన అధికారులు మెమోలు జారీ చేయాలని ఎంపీపీ ఆదేశించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి నారాయణస్వామితో పాటు ఎంపిటిసిలు, సర్పంచులు, ఎంఇఒ తిరుపాల్ నాయక్, ఎఒ లక్ష్మీ ప్రియ, పశు సంవర్ధక శాఖ అధికారి మల్లికార్జున, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకులకు మతిభ్రమించింది : టిడిపి

ప్రజాశక్తి తనకల్లు

వైసిపి నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని తెలుగు యువత మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మక్బూల్ బాషా ప్రజలను పక్కదోవ పట్టించే మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈవీఎం ట్యాంపరింగ్‌తో కూటమి అధికారంలోకి వచ్చిందని ఎలక్షన్ కమిషన్ నే తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. 2019లో వైసిపి 151 సీట్లుతో అధికారంలోకి వచ్చినప్పుడు ఎవరు కూడా ఈవీఎం ట్యాంపరింగ్ అని అనలేదన్నారు. కేవలం ప్రజలను నమ్మించడానికి ఈవీఎం ట్యాంపరింగ్ అని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే కందికుంట పరితపిస్తున్నారని అలాంటి వారిపై అవాకులు చవాకులు పేలితే సహించేది లేదని హెచ్చరించారు. అవాస్తవాలను ప్రచారం చేయడం మానుకొని అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని హితవు పలికారు.

విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఆలయం గడప వద్ద శాసనం గుర్తింపు

పురాతన శాసనాన్నిచూపుతున్న మైనాస్వామి

ప్రజాశక్తి - మడకశిర టౌన్

నొలంబ పల్లవ రాజ్యకేంద్రం హేమావతికి దక్షిణాన చెరువు కట్ట కింద ఉన్న పాత శివాలయంలో హోయసల ప్రభువు రెండో వీరబల్లాల చెక్కించిన కన్నడశాసనాన్ని గుర్తించినట్టు చరిత్రకారుడు మైనాస్వామి చెప్పారు. నోలంబ పల్లవ ఆలయాలు -శిల్ప శైలిపై పరిశోధనలో భాగంగా హేమావతి పరిసరాల్లోని ఆలయాలను పరిశీలిస్తుండగా పాత శివాలయంలో గుడి గడప వద్ద స్తంభశాసనం ఉన్నట్టు గుర్తించినట్లు ఆయన చెప్పారు. శాలివాహన శకం 1111 సౌమ్య నామ సంవత్సరంలో హొయసల రెండో వీరబల్లాలుడు ఆశాసనాన్ని రాయించినట్టు మైనాస్వామి పేర్కొన్నారు. ఆంగ్ల సంవత్సరం ప్రకారం సామాన్య శకం1189 నాడు వీరబల్లాలుడు శివాలయానికి భూదానం చేసి ఉండవచ్చునన్నారు. వాస్తవానికి స్తంభ శాసనం సగం మాత్రమే కనిపిస్తోందనిమిగతా సగం గుడిమెట్లకు ఆసరాగా ఉందని ఆయన వివరించారు. కాగా రెండో వీరబల్లాలునికి చెందిన సా.శ.1206 నాటి మరో దాన శాసనం సిద్దేశ్వర ఆలయ ప్రాంగణంలోని మల్లేశ్వర దేవాలయం ద్వారబంధాలపైో ఉన్నట్టు చరిత్రకారుడు పేర్కొన్నారు. రెండో వీరబల్లాలుడు ద్వార సముద్రం (నేటి హళేబీడు) రాజధానిగా హొయసల రాజ్యాన్ని సా.శ. 1173 నుంచి 1220 వరకు పాలించాడన్నారు.

చరిత్రను చెరపకండి: చరిత్రకు ప్రాణం పోస్తున్న శాసనాలు పలుచోట్ల ఆనవాళ్ళ చెరిగి పోతున్నాయని మైనాస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. శాసనాల ప్రాముఖ్యం ప్రాధాన్యత తెలియని వాళ్ల వాటిని పగులగొట్టడం ఇళ్ల,గుడి నిర్మాణాలకు వాడడం సబబు కాదని శాసనాలను పరిరక్షించాలని కోరారు. శాసనం పట్ల అవగాహన లేని కారణంగా గుడి గడపకు స్తంభ శాసనం వాడుకొని ఉండవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు.

50ఏళ్ల సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని పొడరాళ్లపల్లి గ్రామంలో నెలకొన్న 50 సంవత్సరాలుగా నెలకొన్న సమస్య పరిష్కారం అయింది. గ్రామంలో కొందరు దళితులు 51సెంట్లలో గుడిసెలు వేసుకున్నారు. అయితే దీనిపై భూ యజమానులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో సుమారు 50ఏళ్లుగా వివాదం నడుస్తోంది. భూమి కోసం ఇరు పక్షాల వారు కోర్టుకు వెళ్లినా పరిష్కారం కాలేదు. ఈ విషయాన్ని దళితులు ధర్మవరం టిడిపి ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. 50ఏళ్లుగా ఎవరికీ చెందకుండా ఇబ్బందులు పడుతున్నామని ఇరు పక్షాల వారు శ్రీరామ్ వద్ద వాపోయారు. దీంతో వారితో సుదీర్ఘంగా చర్చించిన పరిటాల శ్రీరామ్ ఇద్దరి మధ్య రాజీ కుదిర్చారు. భూ యజమానాలకు 20సెంట్లు, దళితులకు 31సెంట్లు ఇచ్చేలా ఒప్పందం కుదిర్చారు. దీనికి ఇరు పక్షాల వారు అంగీకరించారు. 31సెంట్లలో 10సెంట్లు రోడ్లు, డ్రైనేజీలకు పోనూ మిగిలిన 21సెంట్లలో 14మందికి ఇంటిపట్టాలు అందజేశారు. దళితులకు సంబందించిన భూమిపై తమకు భవిష్యత్‌లో ఎలాంటి హక్కు లేదని యజమానులు కూడా సంతకాలు చేశారు. పరిటాల శ్రీరామ్ అనంతపురంలోని తన నివాసంలో పేదలకు ఇంటి పట్టాలు అందజేయగా ఇటు దళితులు, అటు భూ యజమానులు శ్రీరామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి దారుణహత్య

ప్రజాశక్తి - నల్లచెరువు

మండలంలోని ఓరువాయి పంచాయతీ కుమ్మరవాండ్లపల్లికి చెందిన చలపతి(34) దారుణ హత్యకు గురయ్యాడు. మల్‌రెడ్డిపల్లికి చెందిన రమణ ఓరువాయి గ్రామంలోని ఎల్లప్ప ఇంటిదగ్గర బేల్దారి పని చేస్తున్న చలపతిని కొడవలితో నరికి చంపాడు. ఈ హత్యకు వివాహేతర సంబంధమే కారణమని స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మక్బూల్‌బాషా తెలిపారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి -చెన్నేకొత్తపల్లి

రామగిరి మండలం వెంకటాపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత పలువురికి సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని చెన్నే కొత్తపల్లి, రామగిరి మండలాలకు చెందిన 19మంది లబ్ధిదారులకు, రూ.11.23 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

రీ సర్వేపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి కలెక్టరేట్లో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి రీ సర్వే, పిజిఆర్ఎస్, స్పెషల్ సమ్మరీ ఓటర్ల జాబితా మ్యాపింగ్, హౌసింగ్, భూసేకరణ తదితర రెవిన్యూ అంశాలపై ఆర్డీవోలు, తహశీల్దార్లు, వీఆర్వో, వీఆర్ఏలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సును మంగళశారం నిర్వహించారు. ఈ చర్యలపై దిశా నిర్దేశం చేసారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్, ఆర్డీవోలు సువర్ణ, మహేష్, వివిఎస్ శర్మ, ఆనంద్ కుమార్, సర్వే శాఖ ఏడీ విజయశాంతి, ఎస్డీసీ రామ సుబ్బయ్య, జి ఎస్ డబ్ల్యు ఎస్ అధికారి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూడో పోటీలకు ధర్మవరం విద్యార్థులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం కళాజ్యోతి కూడలి లోగల ప్రభుత్వ జెడ్పి జిహెచ్ఎస్ స్కూల్లో మంగళవారం జూడో క్యాడెట్ జూనియర్ పోటీలను జిల్లా సెక్రటరీ భాస్కర్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమన, పీడీ స్వరూప, సరళ హాజరయ్యారు. ఈ సందర్భంగా జూడో కోచ్ ఇనాయత్ బాషా మాట్లాడుతూ ఇంతకు ముందు జరిగిన జూడో పోటీలలో పాఠశాలకు చెందిన విద్యార్థినులు గవ్వల యువ సంధ్యా, జాహ్నవి,జన శ్రీ, గాజుల సుస్మిత,కొండా అర్చన ప్రతిభ కనపర్చారన్నారు. వీరు కర్నూల్ లో ఈ నెల 19,20,21 తేదీలలో జరగబోయే రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జింకా పురుషోత్తం, శీనా పాఠశాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా సర్వేను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) సర్వేను బూత్ లెవెల్ అధికారులతో సమన్వయం చేసుకొని నిర్ణీత గడువులోగా పూర్తి అయ్యే చూడాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సూపర్‌వైజర్లకు సూచించారు. సర్వేపై మంగళవారం కమిషనర్ తన చాంబర్‌లో సూపర్ వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఎల్ఓల వారిగా ఇప్పటి వరకు సర్వే శాతం ఎంత వరకు చేశారన్న దానిపై సమీక్షించారు. సర్వేలో వెనుకబడిన వారిని నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చూడాల్సిన బాధ్యత సూపర్‌వైజర్లు తీసుకోవాలన్నారు. ఇందులో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

వైసిపివన్నీ తప్పుడు ప్రచారాలు :ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి టౌన్

వైసిపి నేతలు అస్తిత్వం కోల్పోయి అబద్ధపు మాటలతో తప్పుడు రాజకీయాలు చేస్తున్నారని ఎన్నికల బరిలో నిలవలేని వారు కూడా రాజకీయాలు మాట్లా డడం సిగ్గుచేటని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ విమర్శించారు. మంగళవారం పట్ట ణంలోని రోడ్లు భవనాల అతిథి గృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపు ఓటమి సహజమని ఓడినా గెలిచిన రెండింటినీ సమానంగా చూడాలని అన్నారు. అబద్ధపు తప్పుడు ప్రచారాలు మానుకోవాలని లేకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్, విత్తన బిల్లులతో నష్టం

ప్రజాశక్తి తనకల్లు

కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న విద్యుత్ బిల్లు 2025, విత్తన బిల్లు 2025 వ్యవసాయ రంగంపై తీవ్రమైన ప్రభావం చూపుతాయని రైతుసంఘం నాయకులు అన్నారు. విద్యుత్ బిల్లు 2025 ప్రకారం దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో ఉన్న అన్ని విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రైవేటుపరం అవుతాయన్నారు. విత్తన బిల్లు 2025 పూర్తిగా ప్రైవేట్, కార్పొరేట్ విత్తన కంపెనీల ప్రయోజనాల కొరకే ఉపయోగపడుతుందని అన్నారు. డిసెంబర్ 8వ తేదీన దేశవ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఈ రెండు బిల్లులకు సంబంధించిన ప్రతులను దగ్ధం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎం శివన్న, వివి రమణ, సిఐటియు వేమన్న, వెంకటరమణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగ పంపిణీ

ప్రజాశక్తి - గుడిబండ

రబీలో వ్యవసాయ బోరుబావులు, బోర్ల కింద వేరుశనగ సాగు చేసే రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. మంగళవారం మండల పరిధిలోని సిసి గిరి గ్రామంలో వ్యవసాయ అధికారులతో పాటు టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్ చేతుల మీదుగా రైతులకు వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సి సి గిరి సచివాలయ వ్యవసాయ అధికారి జ్యోతి, మండలపల్లి పంచాయతీ రైతులు పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి: మంత్రి సవిత

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

పెనుకొండ, పుట్టపర్తి ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని టూరిజం శాఖ అధికారులను రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సవిత మాట్లాడుతూ పెనుకొండ, పుట్టపర్తి ప్రాంతంలో పర్యాటకవృద్ధికి అనువైన అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్‌ను ప్రధాన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు. రిజర్వాయర్‌లో బోటింగ్ సదుపాయం, ఆధునిక రిసార్ట్, టూరిజం గెస్ట్ హౌస్ నిర్మాణంపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. పెనుకొండ కొండపై పర్యాటకుల కోసం ప్రత్యేక గెస్ట్ హౌస్ నిర్మించాలని రూపకల్పనలో చారిత్రకత, రాజవంశాల శైలిని ప్రతిబింబించేలా ప్రణాళిక తయారు చేయాలని చెప్పారు. కుంభకర్ణ ప్రాజెక్ట్‌ను మరింత అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించేలా రూపుదిద్దాలన్నారు. శ్రీకృష్ణదేవరాయల జయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు టూరిజం శాఖతో కలిసి సమగ్రమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో నాలుగు వైపులా స్వాగతం పలికే ఆర్చులు ఏర్పాటు చేసి పర్యాటకులకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచేలా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టూరిజం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి వర్ధంతి వేడుకలు: మాజీ మంత్రి ఎస్. రామచంద్ర రెడ్డి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలం లోని రాంపురం లో ఆయన సమాధి కి మంత్రి సవిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు మాజీ మంత్రి రామచంద్ర రెడ్డి ఘాట్‌కు పూలమాలలు వేసి నివాళులర్పించారు.అదేవిధంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి మాజీ మంత్రి రామచంద్రారెడ్డి సమాధికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కురుబ కార్పొరేషన్ డైరెక్టర్లు కేశవయ్య శ్రీనివాసులు, పట్టణ,మండలపార్టీ అధ్యక్షులు శ్రీరాములు యాదవ్, దండు ఈశ్వర్ ప్రసాద్, మాధవ నాయుడు త్రివేంద్ర నాయుడు బాబుల్ రెడ్డి రఘువీరా చౌదరి రామలింగ ఏనుముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ అధికారులతో సమీక్ష : మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఫారెస్ట్ శాఖ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. పెనుకొండ పట్టణ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అటవీ అభివృద్ధి కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ చర్యలు, పర్యాటక అభివృద్ధి పై అధికారులతో చర్చించారు. మంత్రి మాట్లాడుతూ పెనుకొండ కొండ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయడానికి పర్యాటకులను ఆకర్షించేలా మార్చడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఫారెస్ట్ రేంజర్ అధికారి శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని ప్రజలకు వివరించండి : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని మంత్రి సవిత అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పెనుకొండ ,రొద్దం మండలాల బూత్ ఇంచార్జిలతో మంత్రి సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజల సంక్షేమం కోసం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రతి ఇంటికి చేరేలా బూత్ స్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని తెలిపారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కారం చూపించేలా వ్యవహరించాలన్నారు. ప్రతి బూత్‌లో బాధ్యతతో పని చేస్తే పార్టీపై నమ్మకం, ప్రభుత్వం మీద విశ్వాసం మరింత పెరుగుతుందనిమంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో రొద్దం ,పెనుకొండ బూత్ ఇంచార్జిలు పాల్గొని వివిధ అంశాలపై అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ లు మండల కన్వీనర్లు క్లస్టర్, యూనిట్ బూత్ ఇంచార్జి లు తదితరులు పాల్గొన్నారు.